ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 28.05.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు ' రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

2. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి , రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

3. తెలంగాణలో త్వరలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారు వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

4. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వచ్చే మూడు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**సీఎం**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు ' రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్డు అమలు చేయాలని , అన్ని శాఖల లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఆరోగ్యశ్రీ , ఫీజు రీయింబర్స్ మెంట్, కార్మిక శాఖ , బీమా పథకాలు సహా అన్ని శాఖల సమాచారం ఈ కార్డులో ఉంటుందని

ముఖ్యమంత్రి తెలిపారు. AI సహాయంతో డేటా విశ్లేషించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు చేరుతాయని, అనర్హులను గుర్తించడం సులభమవుతుందని పేర్కొన్నారు. అవసరమైతే ఆధార్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కూడా ఆదేశించారు.

డెస్క్

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు . యాదాద్రీ భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , శ్రీధర్ బాబుతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వచ్చే 4 రోజుల పాటు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా పనిచేసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

**పీటీసీ, యాదాద్రి భువనగిరి**

**మంత్రులు**

ఫ్యూచర్ సిటీ ప్రపంచానికే తలమానికంగా నిలవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ఉదయం ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించిన మంత్రులు ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కార్యాలయ భవనం , యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం , ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని మంత్రులు తెలిపారు.

డెస్క్

**టిమ్స్**

సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రి అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి రావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో స్పష్టం చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను స్వయంగా పరిశీలించిన మంత్రి ఆధునిక పరికరాలు , లాబరేటరీ, బ్లడ్ బ్యాంకు సదుపాయాలను సమీక్షించారు. సివిల్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

డెస్క్

**గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి**

ఆసిఫాబాద్ జిల్లా , కొమురం భీం పుట్టిన రౌటసంకపెల్లిలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల రేపు పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గవర్నర్ ప్రారంభించే వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ హరిత దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కొమురం భీమ్ 20 అడుగుల కాంస్య విగ్రహానికి శంకుస్థాపన చేయడంతో పాటు, గిరిజన గ్రామాల్లో వీధిదీపాల ఏర్పాటు ప్రారంభోత్సవం , ఆరోగ్య కార్డులు , సంక్షేమ కార్డులు పంపిణీ , చేయడంతో పాటు గ్రామస్తులతో మద్యపాన నిషేధంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు.

పిటిసి, ఆసిఫాబాద్

**ఉపాధి హామీ - బైట్**

ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్న వంద రోజుల పని దినాలను ఇప్పుడు 125 రోజులకు పెంచడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా , చందుర్తి మండల కేంద్రానికి చెందిన ఉపాధి హామీ పథకం మహిళా కూలీ మర్రి మంజుల కేంద్ర ప్రభుత్వానికి ఆకాశవాణి ద్వారా కృతజ్ఞతలు చెప్పారు...

బైట్ ... మర్రి మంజుల, ఉపాధి హామీ కూలీ

పిటిసి, సిరిసిల్ల

**రామచందర్ రావు**

తెలంగాణలో త్వరలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారు వస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా , మొయినాబాద్‌లో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ మహాభియాన్‌లో ఆయన పాల్గొన్నారు. యూనిఫామ్ సివిల్ కోడ్ దేశంలోని మహిళలకు , పిల్లలకు చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తుందని, దీన్ని ముస్లిం మహిళలు సైతం స్వాగతిస్తున్నారని ఆయన అన్నారు.

పిటిసి, హైదరాబాద్

**ధాన్యం**

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన గత 25 రోజులుగా సేకరణ జరగడం లేదని, గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డెస్క్

**ఈటెల రాజేందర్**

మొక్కజొన్న, వరి పంటల దగ్గరకు వెళితే మంచి వాసన రావాలి కానీ వర్షా నికి తడిసి పోయి ముర్గు వాసన వస్తోందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. రైతు గోస బిజెపి భరోసా యాత్ర భాగంగా నిర్మల్ జిల్లాలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ...

బైట్ ... ఈటెల రాజేందర్

పిటిసి, నిర్మల్

**వాతావరణం**

వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు , ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే

అవకాశం ఉందని వెల్లడించింది. మరోవైపు.. రేపు , ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని ఉత్తర , తూర్పు జిల్లాలలో  వడగాలులు వీచే అవకాశం ఉందని కూడా పేర్కొంది.

పీఎస్

**నల్లగొండ - వర్షం**

నల్లగొండ జిల్లాలో ఈ సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం  కురిసింది. ఒక వైపు ఎండ కాస్తూనే ఈదురుగాలులతో కూడిన భారీ వడగళ్ల వర్షం కురిసింది.   ఉరుములు, మెరుపులతో  కురిసిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. చెట్ల కొమ్మలు రహదారులపై విరిగి పడటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

పిటిసి, నల్గొండ

**ఆసిఫాబాద్ జిల్లాలో వర్షం**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం వరకు 45 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పలు మండలాల్లో కురిసింది.

పిటిసి, ఆసిఫాబాద్

**భట్టి విక్రమార్క**

మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దు       తామని  ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు ఖమ్మం జిల్లా      , ఎర్రుపాలెం మండలంలో రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ  ... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ , నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమ మౌళిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పిటిసి, ఖమ్మం

**కొండా సురేఖ**

మైనార్టీల సంక్షేమానికి , అభ్యున్నతికి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈరోజు బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ లోని పలు ఈద్గాలలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమాల్లో కొండా దంపతులు పాల్గొన్నారు.

**పీటీసి, వరంగల్**

**ఉపాధి హామీ**

తెలంగాణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరందుకున్నాయి. పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క వరుస సమీక్షలతో రాష్ట్ర వ్యాప్తంగా కూలీల హాజరు గణనీయంగా పెరిగిందని , మే మొదటి వారంలో కేవలం ఏడు లక్షలుగా ఉన్న హాజరు, ఇప్పుడు రోజుకు 16 లక్షల 24 వేలకు చేరుకుందని మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వివరించింది.

డెస్క్

**షబ్బీర్ అలీ**

ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే డిమాండ్‌కు బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మద్దతు తెలిపారు. కామారెడ్డిలోని ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న అనంతరం మాట్లాడు తూ... ఈ పండుగ.. విశ్వాసం , త్యాగం, కరుణ, మానవత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి గుర్తు చేస్తుందన్నారు.

పిటిసి, కామారెడ్డి

**సీతక్క**

ఏటూరునాగారంలో మైనర్ బాలిక వ్యవహారంపై తప్పుడు వార్తలు ప్రచురిస్తున్న మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు పంపుతామని పంచాయతీరాజ్ మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈరోజు మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

డెస్క్